క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు పూజలు

ఆరిలోవ: తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంలో పాప ప్రక్షాళన కోసం జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆధ్వర్యంలో శనివారం పూజలు నిర్వహించనున్నారు. 11వ వార్డు ఆరిలోవ టీఐసీ పాయింట్ సమీప భరత్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు చేయనున్నారు. వీటి కోసం ఆలయంలో ఏర్పాట్లు చేసినట్టు మేయర్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పూజల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా పాల్గొనాలని ఆమె కోరారు.

అమర్‌నాథ్‌కు అభినందనలు



గుడివాడ అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శివరామకృష్ణ తదితరులు

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అక్కయ్యపాలెంలోని అమర్‌నాథ్ నివాసంలో శుక్రవారం ఆయనను పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు కె.ఆర్.పాత్రుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు అభినందనలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. అమర్‌నాథ్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మరింత క్రియాశీలకంగా ప్రజలకు, పార్టీకి సేవలు అందిస్తాయన్నారు.

గురుకుల విద్యార్థులకు జ్వరాలపై అవగాహన

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం గురుకులంలో పారిశుధ్యం, మలేరియా విభాగాల ఆధ్వర్యంలో ఫ్రైడే–డ్రైడేలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జ్వరాలపై అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ మంగరాజు మాట్లాడుతూ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమ కాటుతో మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, డెంగ్యూ తదితర జ్వరాలకు గురవుతారన్నారు. పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల సిబ్బంది, గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిరికి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో భగత్‌సింగ్ చేసిన సేవల గురించి విద్యార్థులకు వివరించారు.

ఏయూ సహకార సంఘం అధ్యక్షుడిగా యుగంధర్



కొత్త కార్యవర్గ అధ్యక్షుడు, సభ్యులు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగుల సహకార సంఘం అధ్యక్షుడిగా ఆచార్య ఎస్.ఎం.యుగంధర్ ఎన్నికయ్యారు. సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యుగంధర్‌కు డైరెక్టర్లు, ఏయూ ఉద్యోగులు, సహకార సంఘం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వానొస్తే వణుకే..!



జాతీయ రహదారిలో పాత వెంకోజీపాలెం కొండపై వెలసిన ఇళ్లు



సింహాద్రిపురం కాలనీలో కొండ వరకు ఉన్న గృహాల సముదాయం

- 15వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో ఇదీ పరిస్థితి
- కొండ అంచునున్న ఇళ్లకు రక్షణ కరువు
- వర్షా కాలంలో బిక్కు బిక్కుమంటూ జీవిస్తున్న నివాసులు
- ఏ క్షణాన.. ఏం జరుగుతుందోనని భయాందోళనలు

మద్దిలపాలెం: వెంకోజీపాలెం నుంచి ఇసుకతోట వైపు జాతీయ రహదారిపై వస్తుంటే కుడివైపు కనిపించే ఎత్తయిన కొండ. దాని చివరి వరకు వెలిసిన పేకమేడాల్లాంటి ఇళ్లు. ఈ దృశ్యం చూడటానికి ఇంపుగానే ఉన్నా.. వర్షం పడితే ఆ కొండ అంచులో పెను ప్రమాదమే పొంచి ఉందని తలచుకుంటేనే గుండె జారిపోతుంది. కొండపై నుంచి బండరాళ్లు జారిపడితే పరిస్థితి ఏంటని ఊహించుకుంటేనే.. గగుర్పాటుకు లోనవుతాం. అలాంటి ప్రమాదపు అంచుల మధ్య జీవిస్తున్న ప్రజల పరిస్థితి ఏంటో ఇట్టే అర్థమవుతుంది. చిన్నపాటి వానకే కొండవాలు నివాసులు చిగురుటాకుల్లా వణికిపోతుంటారు. అలాంటిది నెల రోజులుగా వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు కొండవాలు ప్రాంతీయులు బెంబేలెత్తిపోతున్నారు.

ప్రమాదపు అంచున ఇళ్లు..

జీవీఎంసీ 15వ వార్డులోని దుర్గానగర్, లక్ష్మీనరసింహనగర్, సింహాద్రిపురం, పాత వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతాలు జాతీయ రహదారికి ఆనుకొని ఉంటాయి. ఇక్కడ కొండ అంచులపై వందల సంఖ్యలో ఇళ్లు నిర్మించి నివసిస్తున్న ప్రజల పరిస్థితి దయనీయంగా ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవిస్తున్నారు. ఇటీవల విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కొండవాలులో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే కొండకు అటువైపు హనుమంతవాక, ఆరిలోవ వైపు కొన్ని చోట్ల రాళ్లు, మట్టిపెళ్లలు జారిపడిన సంఘటనలున్నాయి.

చినుకు పడితే కునుకు కరువే..

వార్డులోని సింహాద్రిపురం కాలనీ, లక్ష్మీనరసింహనగర్, దుర్గానగర్, పాత వెంకోజీపాలెం తదితర కొండవాలు ప్రాంతాల్లో ఇటీవల కురుస్తున్న వర్షాలకు కంటి మీద కునుకు లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. కొండ చరియల్లో రాళ్లు, మట్టిపెళ్లలు జారి పడుతున్నాయి. రక్షణ గోడల కోసం చేపట్టిన రైయిలింగ్, రాతి కట్టడాల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో కొండవాలు ప్రజలు భయం గుప్పెట్లో బతుకుతున్నారు.

బండరాళ్లు జారిపడే ముప్పు..

ఇక్కడ కొండవాలు ప్రాంతాల్లో సుమారు 8 వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. పాత వెంకోజీపాలెం, లక్ష్మీనరసింహనగర్, దుర్గానగర్, సింహాద్రిపురం ప్రాంతాల్లో సుమారుగా 2,500 ఇళ్లుంటాయి. వాటిలో 12 వేల మంది వరకు జనాభా ఉంటారు. కొండ అంచున కట్టుకున్న ఇళ్లకు పైనుంచి బండరాళ్లు జారిపడే ముప్పు ఉంది. భారీ వర్షాలకు తడిసి ముద్దయితే అంచులు జారిపడటం ఖాయం. ఇక్కడ రక్షణగా రిటైనింగ్ వాల్ కట్టాల్సి ఉంది. కొండవాలులో రక్షణ గోడల నిర్మాణానికి పాలకుల హామీలే తప్పా.. అమలు చేయడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. భారీగా వర్షాలు కురిసే సమయంలో అధికారులంతా వచ్చి హడావిడి చేసి వెళ్లిపోతున్నారే గానీ.. శాశ్వత పరిష్కారం చూపడం లేదని చెబుతున్నారు. కొండవాలు ప్రజల గోడును పట్టించుకుని రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రక్షణ గోడలు నిర్మించాలి



కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు రక్షణ కల్పించాలి. మేము ప్రమాదపు అంచుల్లో నివసిస్తున్నాం. కొండపై నుంచి బండరాళ్లు జారిపడకుండా తక్షణమే రక్షణ గోడలు నిర్మించాలి. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– బుగత ఏసురత్నం, సింహాద్రిపురం

కొండవాలు ప్రజలకు భరోసా కల్పించాలి



కొండలపై బండరాళ్ల కింద బిక్కు బిక్కుమంటూ నివసిస్తున్నాం. కొండల చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలి. కొండవాలు ప్రజల జీవితాలకు భరోసా కల్పించాలి. కనీస సదుపాయాలు కల్పించాలి. కొండపైకి మెట్ల మార్గాలు నిర్మించాలి.

– గొలగాని త్రినాథరావు, లక్ష్మీనరసింహనగర్

దడ పుట్టిస్తున్న దోమలు



- జ్వరాల బారిన ఆరిలోవ ప్రాంత వాసులు
- తూతూ మంత్రంగా అధికారుల చర్యలు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో దోమలు పెరిగిపోతున్నాయి. దీంతో స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. కొన్నాళ్లుగా మలేరియా విభాగం చర్యలు లేకపోవడంతో దోమలు వృద్ధి చెందడానికి కారణమంటూ స్థానికులు భావిస్తున్నారు. అటు తోటగరువు నుంచి బాలాజీనగర్, ముస్తఫా కాలనీ, టీఐసీ పాయింట్, దుర్గాబజార్, ఆరిలోవ కాలనీ, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ వరకు.. ఇటు హనుమంతవాక నుంచి పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వరకు కొండవాలు ప్రాంతాల్లో మలేరియా చర్యలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. నిజానికి ఉదయం సమయంలో మలేరియా సిబ్బంది వీధుల్లో పర్యటించాలి. నీటి కుండీలు, ట్యాంక్‌ల్లో దోమల నివారణ మందు వేయాలి. సాయంత్రం సమయంలో ఫాగింగ్ నిర్వహించాల్సి ఉంది. కొద్ది రోజులుగా ఈ ప్రాంతాల్లో ఆయా చర్యలు మందకొడిగా సాగుతున్నాయి. వారంలో ఏదో చోట ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాలు చేపట్టి నివారణ చర్యలు గాలికి వదిలేశారు. దీంతో దోమలు వృద్ధి చెంది ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దోమల కాటుకు గురై జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేకపోవడం వల్లే దోమల నివారణ చర్యలు అంతంత మాత్రంగా జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఆరిలోవ ప్రాంతవాసులు కోరుతున్నారు.

నేలతో ముడిపడిన మానవ మనుగడ



జియాలజీ సదస్సులో ప్రసంగిస్తున్న అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ చైర్మన్ పద్మనాభయ్య

మద్దిలపాలెం: మానవుడి ప్రతి అవసరం నేలతోనే ముడిపడి ఉందని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా చైర్మన్ కె.పద్మనాభయ్య అన్నారు. ఏయూ జియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు రెండో రోజు కార్యక్రమంలో మైనింగ్, ప్రోసెసింగ్, బీచ్ సాండ్ పరిశ్రమల్లో ప్రస్తుత పోకడలు, విలువ జోడింపు, మైనింగ్ చట్టాలు అనే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాస్త్రాలకు మాతృకగా జియాలజీ నిలుస్తుందన్నారు. విశాఖ తీరంలో కనిపించే నల్లని ఇసుకపై 1947లో పరిశోధన పత్రాలను ఏయూ ఆచార్యులు ప్రచురించారని గుర్తుచేశారు. అనధికార మైనింగ్‌ను నిలువరించాలన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ సముద్రపు ఇసుకలో విలువైన ఖనిజాలను దేశానికి ఉపయుక్తంగా మలచుకోవాలన్నారు. అదే సమయంలో పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సదస్సులో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు ప్రసంగించారు.

బయోడైవర్సిటీ పార్క్ సందర్శనకు ఆహ్వానం



వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు పార్కు యాక్టివిటీస్ వివరాలు అందిస్తున్న రామమూర్తి

ఎంవీపీకాలనీ: పెదవాల్తేర్ ఆర్‌సీడీ హాస్పిటల్ ప్రాంగణంలోని బయోడైవర్సిటీ పార్కును అక్టోబర్ 4వ తేదీ ఉదయం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సందర్శించనున్నారు. పార్కు నిర్వాహకులు ఎం.రామమూర్తి, నిర్వాహణ కమిటీ ప్రతినిధులు శుక్రవారం సిరిపురంలోని కార్యాలయంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్కు నిర్వహణ, అక్కడ అందుబాటులో ఉన్న వినూత్న మొక్కలు, ఎడ్యుకేషన్ యాక్టివిటీస్‌తోపాటు బయోడైవర్సిటీ పార్కు విశిష్టతను ఆయనకు వివరించారు. 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 4న పార్కును సందర్శించాలని వారు ఆహ్వానించగా.. కమిషనర్ అంగీకరించారు.

ఏయూ విభాగాల్లో రెక్టార్ ఆకస్మిక తనిఖీలు



హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు



మెస్‌లో పరిశీలిస్తున్న రెక్టార్ కిషోర్‌బాబు, అధికారులు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీలోని పలు విభాగాల్లో శుక్రవారం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు ఆకస్మిక తనిఖీలు చేశారు. సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్స్ విభాగాల్లో విద్యార్థులకు బోధన జరుగుతున్నా తీరును ప్రత్యక్షంగా తిలకించారు. ఆయా విభాగాల్లో హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విభాగాలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు సమకూర్చాలని విభాగాధిపతులకు సూచించారు. తనిఖీల్లో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల మెస్ పరిశీలన

ఆంధ్రా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల మెస్‌ను శుక్రవారం అధికారులతో కలిసి రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేసి అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల కమిటీతో నిరంతరం భోజన నాణ్యతను పరిశీలిస్తున్నట్లు చీఫ్ వార్డెన్ ఎస్.హరనాథ్ తెలిపారు.

గుండె ఆరోగ్యంపై అవగాహన అవసరం

మద్దిలపాలెం: యుక్త వయసులో కార్డియాక్ అరెస్టులు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో గుండె ఆరోగ్యంపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరముందని శివ హార్ట్ సెంటర్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శివకుమార్ దరిమిరెడ్డి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం గుండె సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు, ఆకస్మిక కార్డియాక్ అరెస్టులు ఒకప్పుడు వృద్ధుల ఆరోగ్య సమస్యగా ఉండేవన్నారు. ఇప్పుడు 20 నుంచి 45 ఏళ్ల వ్యక్తులను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. యువకుల్లో గుండె సంబంధిత వ్యాధులకు ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం, ఒత్తిడి, రక్తపోటు, మధుమేహం, జీవనశైలి తదితర కారణాలున్నాయన్నారు. గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచడం, నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లను అవలంబించడం ద్వారా యువత తమ గుండెను కాపాడుకోవచ్చని సూచించారు. తద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎక్కువ కాలం గడపవచ్చన్నారు.

పర్యావరణ పరిరక్షణకు యువత కృషి

ఎంవీపీకాలనీ: వాతావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ ఎం.వి.వి.మురళీమోహన్ కోరారు. ఈస్ట్‌పాయింట్ కాలనీ కేడీపీఎం స్కూల్‌లో వ్యూస్ ఎన్‌జీవో, ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సంయుక్తంగా శుక్రవారం యూత్ ఫర్ క్లైమేట్ చేంజ్ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, యువత పర్యావరణ హితంగా జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్కూల్ హెచ్‌ఎం సుమతిబాయ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి దశ నుంచే యువత నడుం కట్టాలన్నారు. అనంతరం యూత్ ఫర్ క్లైమేట్ యాక్షన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి.రత్నం, వ్యూస్ సంస్థ కో–ఆర్డినేటర్ జె.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి దుర్గాదేవి ఉత్సవాలు



దుర్గాదేవి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పల్లా దుర్గారావు, మార్గాన వెంకటేశ్వరరావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లో శుక్రవారం దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. రామ్‌నగర్ దుర్గామల్లేశ్వరి ఆలయంలో ఉత్సవాల పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, దుర్గామల్లేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు, బీసీ సంఘం నాయకుడు మార్గాన వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 3న విగ్రహం ఊరేగింపుతోపాటు బాల త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 4న గాయత్రిదేవిగా, 5న అన్నపూర్ణ దేవిగా, 6న లలితా త్రిపుర సుందరీ దేవిగా, 7న మహాచండీ దేవిగా, 8న మహాలక్ష్మీదేవిగా, 9న సరస్వతీ దేవిగా, 10న కనకదుర్గా దేవిగా, 11న మహిషాసుర మర్దనిదేవిగా, 12న రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారిని అలంకరించి శరన్నవ రాత్రి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వీఎంఆర్‌డీఏ కార్యదర్శి కీర్తికి సన్మానం



దాట్ల కీర్తిని సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె విజయనగరం ఆర్డీవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కీర్తిని మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ తన చాంబర్‌లో సన్మానించారు. కార్యక్రమంలో సంయుక్త కమిషనర్ రమేష్, ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ హరిప్రసాద్, ఎస్ఈ భవానీశంకర్, డీఎఫ్‌వో శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

తెరిపివ్వని వర్షం



మద్దిలపాలెం కూడలిలో కురుస్తున్న వర్షం



ఉధృతంగా ప్రవహిస్తున్న ఇసుకతోట గెడ్డ

మద్దిలపాలెం: వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి జనం ఇబ్బందులకు గురయ్యారు. కుండపోత వాన కారణంగా ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. గెడ్డలు పొంగి పొర్లుతున్నాయి. శుక్రవారం కూడా వర్షం కురుస్తూనే ఉంది. మద్దిలపాలెం కూరగాయల బజారు, పెదవాల్తేరు రైతుబజారులో కొనేవారు లేక వెలవెలబోయాయి. గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి బయట పనులు చక్కబెట్టుకోవాల్సి వచ్చింది. వ్యాపారాలు సాగక చిరు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరు మన్నారు. మూడు రోజులుగా బేరాలు లేక తెచ్చిన సరకు పాడైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పొంగిపొర్లుతున్న గెడ్డలు

జీవీఎంసీ 16, 22, 23 వార్డుల్లోని గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీ నుంచి భానునగర్ మీదుగా ఇసుకతోట వరకూ ప్రవహించే గెడ్డలో నీటి ప్రవాహం పెరిగింది. గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం కొట్టుకొస్తున్నాయి. 22వ వార్డు పిఠాపురం, పీతలవానిపాలెం గెడ్డలో ఉధృతంగా నీరు ప్రవహించింది.

నీట మునిగిన కేఆర్‌ఎం కాలనీ

ప్రతి సారి కురుస్తున్న భారీ వర్షానికి కేఆర్‌ఎం కాలనీ నీట మునుగుతోంది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో నివాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ రోడ్లపై వాన నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి.

29న 'నవతి ప్రసన్నం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రఘురామారావు

మహారాణిపేట: ఎన్నో పుస్తకాలు రచించిన ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రెక్టార్, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ప్రసన్నకుమార్ 90వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈనెల 29న నవతి ప్రసన్న కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్‌లో ఉన్న అంకోశా హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోస్టర్, ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నంలో జన్మించి విశాఖలో స్థిరపడ్డ ఆచార్య ప్రసన్నకుమార్ నాలుగు దశాబ్దాలుగా 25 పుస్తకాలు రచించారని తెలిపారు. ఆయన మార్గదర్శకత్వంలో 25 మంది విద్యార్థులు పీహెచ్‌డీలు పొందారని అన్నారు. ఏపీ ప్రభుత్వం, అంతర్జాతీయ సంబంధాలపై రెండు పాఠ్య పుస్తకాలకు ఎంతో పేరు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, మిజోరం గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్ ఆస్పత్రి ప్రైవేటీకరణ ఆపాలి

మద్దిలపాలెం: విశాఖ పోర్ట్ హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత నిధులతో అభివృద్ధి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం పోర్ట్ ఆస్పత్రి 80 పడకలతో పోర్ట్, డాక్‌యార్డ్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, ఫ్యామిలీ పెన్షనర్లు, పూల్ కలాసీలు, సీహెచ్‌డీ క్యాజువల్ కార్మికులు, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు దశాబ్దాలుగా వైద్య సేవలందిస్తోందన్నారు. ఇటువంటి ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేటుపరం చేయడం న్యాయం కాదని చెప్పారు. ఇలా చేస్తే ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడమే అవుతుందన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు దృష్టి సారించి పోర్ట్ ఆస్పత్రిని పూర్తిగా ప్రభుత్వ అధీనంలో ఉంచాలని కోరారు.

'ఫ్రైడే–డ్రైడే' డీఎంహెచ్‌వో పరిశీలన



నిల్వ నీటిలో లార్వా జాడలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదర్శనగర్, ఫిషర్‌మెన్ కాలనీల్లో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లను ఆయన పరిశీలించారు. కొన్ని చోట్ల లార్వా అధికంగా ఉండటాన్ని గమనించి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారిని ఆదేశించారు. ఎక్కడైనా ఫీవర్, డెంగ్యూ కేసులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కేసులు నమోదైతే ఆ ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ జరుగుతోందా లేదా వివరాలు అని ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరానికి ఈశాన్య ట్రైనీ పోలీసులు

విశాఖ సిటీ: నార్త్ ఈస్ట్ పోలీస్ అకాడమీ (నెపా) నుంచి 5 మంది ట్రైనీ డీఎస్పీలు, 10 మంది ట్రైనీ ఎస్‌ఐలు అధ్యయన పర్యటన (భారత్ దర్శన్) నిమిత్తం విశాఖకు వచ్చారు. ఈ నెల 29వ తేదీ వరకు పోలీస్ విభాగానికి చెందిన పోలీస్ కంట్రోల్ రూమ్, 3వ పట్టణ పోలీస్‌స్టేషన్, ఫింగర్ ప్రింగ్ బ్యూరోతో పాటు నగరంలో పలు అధ్యయన కేంద్రాలు, చారిత్రాత్మక, పురావస్తు ప్రదేశాలను సందర్శించనున్నారు. శుక్రవారం వీరిని బీచ్ రోడ్డులో ఉన్న పోలీస్ ఆఫీసర్ మెస్‌లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కలిశారు. వీరితో సమావేశం నిర్వహించి పలు అనుభవాలను పంచుకున్నారు. మెళకువలను వివరించారు. దేశ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన విధులపై అవగాహన కల్పించారు.